# కందిరీగలు

ఊరు మధ్యనుండి రోడ్డు, అందువల్లనే అక్కడ బస్సు ఆగింది. ఓ నడివయస్సు వ్యక్తి దిగగా, దూరంనుండి ఓ యువకుడు ఎక్కడం కోసం పరుగెత్తుతున్నాడు, కాని అతడు చేరేలోగానే బస్సు తుర్రుమన్నది.

ఎప్పుడో గాని వచ్చే ఈ చిన్న బస్సు తప్పినందుకు మనస్సు ఉస్సూరుమంది. ''అరేయ్

యిటు రారా'' అరుపులాంటి పిలుపుకు ఇద్దరు ఒకేసారి వెనక్కు చూశారు. ఆ ఇద్దరిది ఆ వూరు కాదు. ''అరే ఆవో'' మళ్లీ అలాంటి పిలుపే, మొదట పిలిచినతనే. బస్సు దిగిన వ్యక్తి ఈ ఊరి గూర్చి పట్టణంలోనే విన్నాడు. గుండ్రాపల్లిలో రజాకార్లు జనాన్ని నానా బాధలు పెడుతున్నారని, అతను విన్నట్టే రోడ్డు పక్కన రజాకార్లు, వాళ్ల చేతుల్లో తుపాకులు. కనబడితే కాల్చేస్తారుట. అని గుర్తుకు రాగానే కడుపులో భయం, కళ్లలో బెదురు ఇక పరుగులాంటి నడకే నడక.

''అబ్బేయ్ భగ్'' అంటూ తుపాకిని గురిపెట్టాడు. ఆ వ్యక్తి పరుగులో వేగాన్ని పెంచే ప్రయత్నంలో బోర్ల పడిపోయాడు.

తుపాకి పేలింది.

''అమ్మా'' ఆర్తనాదం.

అది చూసిన యువకుడు నిర్ఘాంతపోయి, పరుగెత్తితే తనకు అదే గతిపడుతుందేమో అని కదలకుండ నిలుచున్నాడు. ఎదురుగా రక్తపు మడుగులో గిల గిలా కొట్టుకుంటున్న మనిషి. అతని చేతిలోని సంచి పక్కకు పడి పోయి అందులోనుండి అరటి పండ్లు, జిలేబి పొట్లం, చిన్నపిల్లల కొత్త బట్టలు చిందరవందరగా కింద పడ్డాయి. చుట్టు పక్కల వున్న ఏ వూరు వెళ్లడానికి దిగాడో? ఈయన రాకకోసం భార్య పిల్లలు ఎంత ఎదురు చూస్తున్నారో! తుపాకి చప్పుడుకు చుట్టుపట్ల ఇళ్ల తలుపులు మూసుకున్నాయి.

''అరే-ఆ'' మళ్లీ తుపాకివాని పిలుపు. ఈ లోపుగా మరో నలుగురొచ్చి నిలుచున్నారు. అందరూ కందిరీగల గుంపులా ముసురుకున్నారు. యువకుడు చదువున్నవాడు, చంకలో సంచి చేతులు జోడించి అతనివైపే చూస్తు వెళ్ళి ఎదురుగ నిలుచున్నాడే కాని భయంవల్లా మెన్నులో ఏదో తన్ని పట్టినట్టుగవుంది.

''ఎవడ్రా నీవు'' గుడ్లగూబ చూపు
భయంతో నోరు పెకల లేదు.

''ఏవూరు?'' ఎడమచేతి చూపుడు వేలును తుపాకి గొట్టంలా కదిలిస్తూ అడిగాడు.

''మల్లారెడ్డి గూడెం'' ఊపిరి బిగపట్టి చెప్పాడు.

''చీకటోనివా, కాంగ్రేసోనివా?'' చూపులో కసి, మాటలో వెటకారం
రెండూ కాదన్నట్టు తల అడ్డంగా వూపాడు.

''మీటింగుకు పోతున్నావుర'' ఆరా తీసినట్టు అడిగాడు.

లేదు అన్నట్టు తల ఆడించాడు.

''ఆ తైలీలో ఏమున్నది?'' వేటకుక్క చూపు.

''బట్టలు, కాగితాలు'' బిక్కుబిక్కుమంటూ చూస్తూ అన్నాడు.

''అంటే నీవు కవివారా'' తలను కిందికి పైకి వూపుతూ అన్నాడు.

''కాదు టీచర్‌ను'' అన్నాడు వినయపు చూపులతో.

''హ్వా..హ్వా.. టీచర్ వా'' అని తుపాకీని తన ఎదురుగా నిలబెట్టుకొని దానిమీద రెండు చేతులుంచి నవ్వాడు. అతని ఎదమీద బుల్లెట్ల రౌండ్స్ వున్న బెల్ట్, కళ్లమీదకొస్తున్న వెంట్రుకలు. చెయ్యెత్తు నిండైన విగ్రహం. పేరు 'సయ్యద్ మక్బూల్'. గ్రామీణుల నాలుకపై ఆపేరు 'సయ్యద్ మెగూల్'గా మారింది. నలబైపైనే వున్న మక్బూల్ చుట్టు పట్టు జనాలను నీళ్ళు తాగనివ్వటం లేదు- నిద్ర పోనివ్వటం లేదు. పగలు ముదురెండ, రాత్రి ఈదురుగాలిలాంటి మక్బూల్‌కు సర్కార్ అండదండలు, పోలీసుల తానతందాన. చీమలు పెట్టిన పుట్టలో పాము చేరినట్టు సాధుజనులు కట్టుకున్న సరాయిలో మక్బూల్ మకాం. చుట్టూరా వున్న గ్రామాల దళితులు వంతులవారీగా వచ్చి చాకిరీ చేస్తూ

వుంటరు. చుట్టమై ఈ ఊరొచ్చి దయ్యపై కూర్చుండు.

''నీకు ఉర్దూ వస్తదిరా'' కనుబొమ్మలను ముడివేస్తూ అడిగాడు.

''ఏదో కొర్ది కొర్దిగా'' అన్నాడు నీళ్ళు నములుతూ.

''నీకే కొర్దిగొస్తె పిల్లలకి ఏం జెపుతావ్'' ఎగతాళిగా చూస్తూ.

'తెలుగు' కొంచెం నిబ్బరంగా అన్నాడు.

''అబ్బే తెలంగి, భేఢంగి, నీ తేలంగి ఎవరికి కావాలె'' అంటూ సంచిలో చేయి వేసి కాగితాలను లాక్కున్నాడు. అప్పుడు చేతిలోని సంచి జారి కిందపడగా అందులోనుండి సద్ద రొట్టెల మడత పక్కకు పడ్డది. వాటిని అందుకోవడానికి వంగిన యువకుని వెన్నుమీద పడ్డ తుపాకీ మడమ దెబ్బకు అట్లనే భూమి మీద బోర్లా పడిపోయాడు.

'లే, భే' లే, గీ పర్కాణ నిజాం సర్కారుదే.

''అవును'' అన్నట్టు తలాడిస్తూ సంచీని సర్దుకుంటూ లేచాడు.

''మాదేమో హుకూమత్, మీకేమో నౌకర్లు'' కనుబొమ్మలెగరేస్తూ అన్నాడు. బిత్తరపోయి చూస్తున్నాడు టీచర్.

'తనఖా నిజాం సర్కారుది జెప్పేది తెలంగి' పెదాలను బిగపట్టి వదులుతూ అన్నాడు.

''ఇగ ఊర్కిపో'' ఎడమచేత్తో సైగ చేశాడు.

''నా ఆర్డరు కాగితం''

''రయినేదెరే''

''ఈ రోజు జాయిన్ కాకపోతే నౌకర్ పోతది'' అతురత.

''పోనీ నీబదులు ఇంకొకరు జేస్తరు'' నింపాదిగా.

''అట్ల వీలుండదు. ఎవరికి ఉద్యోగం వస్తే వాళ్ళే'' అనే లోపే

''గదంతా మేంజూస్కుంటాం పో'' తానే నిజాం సర్కారు తరపు

అధికారిలా అన్నాడు.

''మేం పేదోళ్ళం, పదేండ్లు చదివితే ఈ నౌకరి వచ్చింది నా కాగితం నాకిచ్చేయండి'' భయం భయంగా అడిగాడు.

''ఇయ్యకుంటే'' కళ్ళను ఓసారి మూసి తెరుస్తూ అన్నాడు.

''నీ కాళ్ళు పట్టుకుంటా ఇచ్చేయండి'' అంటూ కాళ్లమీద పడ్డాడు. నహీ అంటూ కారణం లేకుండా తన్నాడు, కందిరీగ కాటేసినట్టు.

కందిరీగ మనిషిని ఎందుకు కాటేస్తుందో ఇంతవరకు తెలియదు.

చేతులు జోడించి.. '' నా కాగితం నాకిచ్చేయండి'' అంటూ బతిమిలాడాడు.

''ఉట్ సాలె'' అంటూ కాగితాన్ని మడిచి పట్టుకున్నాడు. ఆతురుతగా దోసిలి పట్టి నిల్చున్నాడు టీచర్.

'పో.. భే' అంటూ కాగితాన్ని తిరిగి ఇచ్చేశాడు.

యువకుడు కొంత దూరం వెనక్కు వెనక్కు నడిచి ఆ తర్వాత రోడ్డు వైపు మళ్లి చావు తప్పినందుకు చంకలోని సంచీని చేతిలోనికి మార్చుకుని భయాన్ని వొదులుతూ ఓ నిట్టూర్పు విడిచాడు.

''ధన్'' మన్న శబ్దం. వీపులోనుండి దూసుకొచ్చిన తూటా కడుపులోనుండి బయటకి వెళ్ళిపోయింది. రెప్పపాటుతో తన రక్తంతో తానే తడిసినట్టు గ్రహించి నేలమీద వంగుతూ సంచీని కడుపుకు అదిమి పట్టుకున్నాడు. మరోసారి తుపాకీ పేలింది. 'అమ్మా' అంటూ నెలకొరిగాడు చిన్నగున్నప్పుడే భర్త పోగా కొడుకును పెంచి పెద్ద చేస్తే ఈరోజు నలుగురికి పాఠాలు చెప్పే బడి పంతులు అయ్యాడు. కష్టం ఫలించిందని కంటనీటితో తెల్లవారుఝామున సాగనంపిన తల్లికి 'అమ్మా' అన్న ఆఖరి పిలుపు వినపడుతుందా?

పట్టపగలు రోడ్డునుండి ఊల్లోకి వచ్చే బండ్ల బాటన ఓ లారీ పరుగెత్తుకొచ్చింది. లారీ నిండా రజాకారలు. మిడతల దండు కోతకొచ్చిన పంటచేనుమీద వాలినట్టు ఊరు మీద పడ్డారు. ఊరు ఉల్క్రిపడి అతలా కుతలం అయ్యింది. కుక్కల అరుపులు, పందుల పరుగులు. ఎందుకో పందుల చూడగానే తుపాకులను పేల్చగ ఎక్కడివి అక్కడే ప్రాణాలు వదులుతుంటె చూసిన కుక్కలు బెదిరి వెనక్కు వెనక్కు పరుగెత్తి సందుల్లో గొందుల్లో నక్కుతువున్నాయి.

''హా! మారో'' మక్బూల్ అరుపు. అది విని ఇళ్లు వొదిలి చంకన చంటి పిల్లలతో, ఎడ పిల్లలను ఈడ్చుకుంటు ఆడవాళ్ళు పరుగెడుతుంటె వెనకాల వాళ్ల మగవాళ్ళు. స్త్రీల నగలు గుంజుకోగ చెవులు తెగి కొందరు, చేతులు తెగి కొందరు ఏడ్పులు పెడబొబ్బలు. చివరికి పుస్తెలను కూడ వదలలేదు.

ఈ బీభత్సాన్ని చూసిన జనం చెట్టుకొకడు పుట్టకొకడు పారిపోతున్నారే తప్ప ఎవరూ ఎదురు తిరగడం లేదు. పొగపెడితే తేనెటీగలు తెట్టెను వదలిపోయినట్టు తుపాకులు పేలుతుంటే జనం ఊరొదిలి పోయారు.

''భాగ్గయే సాలే, ఘరోంకో లూటో'' తలుపులు ఇరగతన్నగ గొళ్ళాలు తెగిపోయినవి. పెట్టెలను బయట పడవేశారు. బట్టలను పారవేశారు. పప్పు ధాన్యాన్ని, దంపుడు బియ్యాన్ని మూటలు కట్టి లారీలో వేసుకున్నారు. పారిపోలేని ముదుసలి వాళ్ళను చావడి దగ్గర్కి చేర్చి--

''ఈ ఊరంతా దొంగ సాలే గాండ్లే. అటు చీకటోళ్లు, యిటు కాంగ్రేసోళ్ళు మిలాకత్ అయి నిజాం ఉకుమత్‌ను పడగొట్టాలని జూస్తుండ్రు, నయిచెలేగ కబర్దార్ అట్లు జేస్తే ఈ ఊరును ఖబరస్తాన్

జేస్తం. ఖాశీం రజ్వీ పేరు యిన్నారు గదా గయన్ని గుర్తు జేసుకోండి''
అని ఒగిరిస్తు చెప్పి-

''హల్ హ(జత్'' అని గొంతెత్తి అరిచాడు మక్బూల్

''జిందాబాద్'' అన్నారు అనుచరులు.

''తక్త్ ఔర్ తాజ్''

''సలామత్ రహేగా'' అన్నారు అనుచరులు.

ఈ లోపల కొందరు వెళ్లి యిండ్లకు నిప్పు పెట్టారు. నిప్పుకు గాలి తోడైంది. నల్లని పొగ, ఎ(రని మంటలు.

లారి వెళ్ళి వచ్చిన దారిన పరుగెత్తుతూ దుమ్ములేపింది. నీరు, బొగ్గుతో నడిచే లారీ కాబట్టి శబ్దం ఎక్కువ. దాని శబ్దానికి బాటెమ్మటి పశువులు బెదిరి చూస్తున్నాయి. ఆవులు వెనక తోకలను లేపుకొని అరుస్తు పరుగెత్తుతున్న దూడలు, మక్బూల్ దృష్టి వాటిమీద పడగానే లారీని ఆపి బలిసిన లేగదూడను పట్టుకు రమ్మని సైగ చేసాడు. అనుచరులు లేగదూడను అందుకొని లారీలో వేసుకున్నారు. లారీ స్టార్ట్ అయి పోతూవుంటె అటుఇటు తారాడుతూ ''అంబా'' అని అరుస్తున్న ఆవులు.

ఊళ్లో యింకా మంటలు లేస్తూనే వున్నయి. ఆర్పుకోవలసిన వారంతా అడవిపాలైనారు.

మధ్యరా(త్రి చిమ్మ చీకటి, అందరు ఆదమరచి ని(దిస్తున్నవేళ్ళ ఒక్కసారే తుపాకి పేలింది.

••••

''అమ్మో'' అంటు ఓ స్త్రీ అరుపు! పక్కెమ్మటే పడుకున్న వ్యక్తి మంచం మీదనుండి కిందికి దొర్లాడు. కాపలవాళ్లు తుపాకుల (టిగ్గర్లపై వేళ్ళుంచి నిలుచున్నారు. పడుకున్నవాళ్లు లేచి కందీళ్ళ బత్తీలను పెంచారు.

వెనక ఏదో పడిపోయిన శబ్దం. ఆ తరువాత మనుషులు పరుగెత్తుతున్న అలికిడి. మంచం మీది స్త్రీ రెండు సార్లు మాత్రమే మూలిగింది. అది గమనించిన మంచం కింది మనిషిలేచి గన్ అందుకొని బయటికి పరుగెత్తుకొచ్చి,

''భాగో భాగో'' ఆందోళనతో కూడిన అరుపు

ప్రహారీ గోడ గేటు తెరుచుకుంది.

''చోడ్నా నహీఁపకడో'' అదే అరుపులాంటి శబ్దం.

కాపలాదారులు నాలుగు వైపుల పరుగెత్తారు వాళ్ళతో పాటు అక్కడున్న మిగతా వాళ్లు పరుగెత్తారు. కందిలి వెలుగులో కందీళ్ళు పట్టుకున్న వాళ్లు కనిపించినట్లు పరుగెత్తే వాళ్లు కనిపించరు. ఊరంతా వెతికారు. ఊరి బయట చూశారు. ఎవరు కనిపించలేదు. అందరు తిరిగొచ్చి మక్బూల్ తిట్లను భరిస్తు నిలుచున్నారు.

మరునాడు పొద్దున్నే చుట్టూవున్న ఊళ్లమీద పడి అనుమాన మొచ్చిన ప్రతి వాణ్ణి పట్టుకరమ్మన్నాడు. పోలీసులు, రజాకార్లు, కలిసి మధ్యాహ్నం వరకు ముప్పైమందిని ఈడ్చుకొచ్చారు. రోడ్డు పక్కనున్నటే పెద్దబావి దగ్గర వరసగ నిల్చోపెట్టారు. తన భార్యను పొట్టన పెట్టుకున్న దెవరో చెప్పమన్నాడు. తన మీద ఈ హత్యాప్రయత్నం ఎవరు తల పెట్టారో చెప్పమన్నాడు.

అందరు తలవంచుకొని నిలుచున్నారు తప్ప తమకు తెలియని విషయం ఏం చెపుతారు?

''జెప్పకుంటే సావు తప్పదు'' అని గద్దించాడు.

ఎవరినోట మాట రాలేదు.

''జెప్పరా?'' అంటూ ఒక్కొక్కరిని తుపాకి మడమతో గుద్దించాడు.

ఎవరు నోరు విప్పలేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఏ తుపాకి ఎప్పుడు పేలుతుందో అని మధ్య మధ్యన వాటి వైపే చూస్తు వున్నారు. వాళ్ళంతా కాయకష్టం చేసుకుని బతికే కూలీనాలీ జనం.

''బోల్ సాలే బోల్'' అంటు గుడ్లురిమి చూశాడు. పండ్లు పట పట కొరికాడు. రెప్పకొట్టకుండ డేగ చూపు చూస్తున్నాడు.

అసలు ఆ సంగతే తెలియని అమాయకులు, అడిగేది అర్థంకాక చెప్పేందుకు జవాబులేక ప్రాణాలను బిగపట్టుకొని చూస్తువున్నారు. అందరి గొంతుల్లో తడారి పోయింది.

''నహీఁ బోల్తా'' అని అరిచినప్పుడం పగ, కసి కోపంతో దానవరూపంలో మారాడు.

''జెప్పండిరా లేకపోతే కుక్కచావు ఛస్తారు'' అన్నాడు నైజాం పోలీసాఫీసరు. ఈయన రెడ్డి!

''ఏ సబ్ ఖాతిల్ హై'' అంటు అరిచాడు మఖ్బూల్

''అవును అని ఆమోద ముద్ర వేసాడు. తాలూక్‌దార్ రావుగారు.

''జలావో సబ్కొ'' మఖ్బూల్ అరుపు

గన్ నిప్పులు కక్కింది.

'అమ్మా' - 'అయ్యో' అన్న ఆర్తనాదాలె! దిక్కులు పిక్కటిల్లే అరుపులు! తెరచివున్న కళ్లు చూస్తున్నట్టుగ వుండి శరీరాలు నెత్తురు చిమ్మగ అక్కడంతా రక్తపు మడుగైంది. వరుసగా ఒక్కొక్కరు బావి బొందలో వెల్లకిల పడిపోగ కొందరు పక్కకు పడి కాళ్లు చేతులు కొట్టుకుంటు మూలుగుతూ వుంటె రజాకారులు వెళ్ళి వాళ్ళను బావిలోకి పడతన్నుతువున్నారు. బావిలో తుది శ్వాసల చప్పుల్లు ఎవరు వింటారు! ఆ తరువాత కట్టెలను కాలిబండ్లను పడవేసి నిప్పు పెట్టారు.

ఊరంతా శ్మశాన వాటిక!

దశ దిశల మనిషి కాలుతున్న కమురు వాసన!

మైళ్ల కొలది విషాద పొగలు, కన్నీటి కాలువలు!

••••

తెల్ల తెల్ల వారంగ-

కాలుకొర్ది పరుగెత్తిన దళం సభ్యులు వేములకొండ గుట్టకు చేరారు. మఖ్‌భూల్ నా కొడుకు బతికి పోయిండు మనలను వొదలడని అంగలార్చుతున్నప్పుడు-

రాత్రి జరిగిన సంఘటన కళ్లముందుకొచ్చింది.

ఇద్దరు రెండు నిచ్చెనలను ప్రహారీ గోడకుంచి కదలకుండ పట్టుకున్నారు. మరో యిద్దరు నిచ్చెనలపై మెట్టుకు తాడు కట్టి, ఆపదొస్తే మనిషితో వున్న నిచ్చెనను వెనక్కు గుంజడానికి నిలుచున్నారు. నిచ్చెనలను ఎక్కి నిలుచున్న వ్యక్తులకు తూటాలను నింపిన తుపాకులను అందివ్వడానికి మరో యిద్దరు నిలుచున్నారు. కాపలా వాళ్ళను కనిపెడుతూ మరో యిద్దరు నిలుచున్నారు. అందరు కలిసి పదిమంది. అదే గుండ్రాంపల్లికి చెందిన బక్కయ్య వాళ్ళల్లో ఒకడు. ఏం చేయాలో, ఎలా చేయాలో ఎవరెవరు ఏ పని చేయాలో ముందే అనుకున్నట్టుగ పలివెల గ్రామ నివాసి గుర్నాథ్ రెడ్డి నాయకత్వంలో చాలా కట్టుదిట్టంగానే అమలు పరిచారు. అయినా గురి తప్పింది. పొద్దుగూకే వరకు గుట్టమీద వుండి చుట్టూరా కనిపెడుతూ కూర్చున్నారు. ఆకలి దూపను ఆపుకున్నారు. పొద్దు బారెడుంది! చీకటి పడకముందే ఏదన్న ఊరు చేరాలని గుట్టను దిగి గుండ్ల చాటున నిలుచున్నారు.

ఎక్కడినుండో సన్నగా ఓ పాట, అటువైపు చెవులు రిక్కించి

వింటున్నారు. అడవినుండి ఊళ్ళోకి వెళుతున్న పశువులు వాటిని కాసే పిలగాళ్ళు. ఒకడు దున్నపోతుమీద కూర్చుని గొంతెత్తి పాట పాడుతూ, దాని కనుగుణంగా తాను తినే రాతెండి గిన్నెపై దరువేస్తున్నాడు. దగ్గర అవుతున్న కొద్దీ పాటలోని పదాలు వినపడుతున్నాయి. ''బండెనుక బండి గట్టి / పదహారు బండ్లు గట్టి / ఏ బండ్ల వస్తవు కొడుకో / నైజాము సర్కారోడా'' ఆ పాట పాడితే పట్టుకపోతరన్న విషయం ఆ పాడే బాలునికి తెలియదు. అది నిషేధించపడ్డ పాట. అయినా ఆ పాట తెలంగాణ గాలి తరంగాలలో ప్రతిధ్వనిస్తూ, వాగుల్లో వరదలుగ పారుతువుంది. ఈ పాటే నడికట్టున వున్న కొడవళ్ళను పిడికిల్లోకి తెచ్చింది. పూర్తి పాట విని ఆ పాటను అల్లిన యాదగిరి గుర్తుకు రాగానే తమ కర్తవ్యం గుర్తుకొచ్చింది. అందరు అక్కడినుండి కదులుతూ కనుసైగలు చేసుకొని ఒకరు వెళ్ళిన వైపు మరొకరు వెళ్ళకుండ తలో వైపు ఎవరికి అనుమానం రాకుండ సహజరీతుల్లో మౌనంగా నడిచారు.

ఆ తరువాత ఊరూరి కొలిమిలో నిప్పురాజుకుంది.!

ఆయుధాలు పదునెక్కుతున్నాయి!

పోరాటం ముమ్మరమైంది. ఎవరిచేతిలో చూసిన ఏదో ఓ ఆయుధమే!

''దెబ్బకు దెబ్బ!''

రాజుకుంటున్న పొగకు ఊపిరాడక కందిరీగల తెట్టె కదిలిపోయింది!

•1996

ఆంధ్రప్రభ

ఆగస్టు '1998